లేడీస్ హాస్టల్ ముందు నిల్చున్నాడు మూర్తి.

" ఐ కన్ డు యెనీ థింగ్......... ఇన్ థిస్ వరల్డ్....... ఎయిదర్ గుడ్ ఆర్ బాడ్ " మంచి పనుల్ని ప్రపంచం ఎలాగూ చెయ్యనివ్వదు. చేసినా హర్షించదు. పైగా మంచి చేసిన వాడికి ప్రపంచం ఇచ్చే ఏకైక బిరుదు వెర్రిబాగులవాడని. అందుకు చరిత్రే సాక్ష్యం.

నేటి మనిషికి అల్టిమేట్ గోల్ బేడ్-అందుకే థింక్ బేడ్, సీ బేడ్-డు బేడ్ ఇదీ మూర్తి థీరీ!

ఈ మూడు లక్షణాలు వుంటే లైఫంతా దిల్ దునియా. అలాంటి దునియాలో అలాంటి వ్యక్తుల్ని సులభంగా గుర్తుపట్టగలడు మూర్తి. అందుకే .....

మధుకర్ తన చెప్పుచేతల్లో ఉండాలంటే, ఈ మాత్రం సాహసం తనకు అవసరం.

అందుకే ఈ పనికి సుధారాణిని ఎంచుకున్నాడు.

"ఎంత నీ కజిన్ సిస్టరైనా ఈ టైమ్‌లో లోపలికి పంపించడం వీలు కాదయ్యా ...." గేట్‌మెన్ అన్నాడు, మూర్తి చెప్పిన అబద్ధాన్ని నమ్ముతూ.

"నాదీ వూరు కాదయ్యా బాబు. సాయంత్రం బస్సుకెళ్ళిపోవాలి. ఒక్కసారి పలకరించి వెళ్ళిపోతాను. రూల్స్ రూల్సేనయ్యా. ఫైవ్ మినిట్స్ ..... అంతే" జేబులోంచి వందరూపాయల నోటు తీసి గేట్‌మాన్ చేతిలో పెట్టాడు మూర్తి.

"వార్డెన్ వచ్చే టైమైంది. జల్దీగా వచ్చెయ్. అదిగో నేరుగా వెళ్ళు. ఆఫీస్ రూం ..... అక్కడ సర్వెంట్ మెయిడ్‌తో చెప్తే" చెప్పాడు గేట్‌మెన్. చెప్పటం పూర్తికాకముందే గబగబా లోనికి నడిచాడు మూర్తి.

ఆఫీస్ రూమ్‌లో సర్వెంట్ మెయిడూ లేదు, ఎవ్వరూ లేరు. వరండా అంతా నిశ్శబ్దంగా వుంది.

గదుల్లోంచి అమ్మాయిల మాటలు చిన్నగా వినబడుతున్నాయి. గబుక్కున ముందుకెళ్ళిపోయాడు. ఓ రూమ్ డోర్ వారగా తీసుంది.

తలుపు ముందుకి తోశాడు నెమ్మదిగా.

ఓ అమ్మాయి, వెల్లికిలా పడుకుని కాలుమీద కాలు వేసుకొని మహాభారతం చదువుతోంది. అట్టమీద 'మహాభారతం' అక్షరాల్ని చూసి ఆశ్చర్యపోయాడు మూర్తి.

పదహారేళ్ళ పాప చేతిలో మహాభారతం! విచిత్రంగా వుందే. తనేం అమ్మాయిల హాస్టల్‌కి వచ్చాడా? లేదా రామకృష్ణ మఠానికొచ్చాడా? సందేహం వచ్చింది. చిన్నగా దగ్గాడు. ఆ దగ్గుతో బెడ్‌మీద ఉన్న అమ్మాయి, అక్కడ ఆ సమయంలో ఓ అబ్బాయి కనబడడంతో, కెవ్వుమని కేకవేయబోయి, ఆగి--

"ఎవరండీ, ఎవరు కావాలి" అంది గాభారాగా.

అదే సమయంలో ఆ అమ్మాయి చేతిలో మహాభారతం అట్ట కింద పడిపోయింది.

అప్పుడు బయటపడింది ఆ అమ్మాయి చేతిలో మ్యాగజైన్. డెబోనెయిర్ అది.

"సారీ మేడమ్ సుధారాణి ఎమ్.ఎస్.సి., ఫైనలియర్. ఏ రూమో చెప్తారా?" వినయంగా మొహం పెట్టి అడిగాడు మూర్తి.

"సుధా ..... నా ..... మీకేమౌతుంది"

"కజిన్. అర్జంటుగా కలవాలి"

"నా రూమ్మేట్. కానీ ఎప్పుడొస్తుందో, ఎక్కడికెళుతుందో ఎవ్వరికీ తెలీదు. ఉదయం తొమ్మిది గంటలకు బయటకెళ్ళింది. ఇంతవరకూ రాలేదు. రోజూ వార్డెన్ చేత అక్షింతలు నాకు" ఆగి ఆగి అంది నెమ్మదిగా ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ.

"మరిప్పుడు రావచ్చునంటారా" మరింత వినయంగా అడిగాడు మూర్తి.

"మరీ పాతాళభైరవిలో రామారావులా రావచ్చునంటారా, కాదంటారా అంటే నేనేం చెప్పలేను. ఇంతకీ మీరు వార్డెన్ పర్మిషన్‌తోనే వచ్చారా?"

"లేదు"

"కొంప మునిగింది. మీరు ముందు అర్జంట్‌గా గేటు బయటకెళ్ళిపోండి. వార్డెన్ వచ్చే టైమైంది. మిమ్మల్నిక్కడ చూస్తే నన్ను డిస్‌మిస్ చేస్తుంది" ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా డోర్ వేసేసుకుంది ఆ అమ్మాయి.

ఈ డెవిల్ వచ్చేవరకు వెయిట్ చెయ్యక తప్పదా. ఐతే ఎక్కడ వెయిట్ చెయ్యాలి. ఆఫీస్ రూంలోనా గేటు బయటా ఆలోచిస్తూ వస్తున్న మూర్తికి ఘీంకారం లాంటి అరుపు, ఏనుగులాంటి ఆకారం వినబడి, కనబడేసరికి సదరు శాల్తీయే వార్డెన్ అయుంటుందని అనుకుని వినయంగా మొహం పెట్టి--

"గుడ్ ఆఫ్టర్ నూన్ ఆంటీ- మా సిస్టర్" ఏదో అనబోయాడు.

"లుక్ మిష్టర్! హు ఆర్యూ కమ్ కమ్ కమ్" అంటూ చికాగ్గా మొహం పెట్టి ఆఫీస్‌రూమ్‌లో కెళ్ళిందావిడ.

ఆఫీస్‌రూమ్‌లో తన సీట్లో కూర్చున్నాక అఫీషియల్‌గా ఫైరయిపోయింది. "ఎవఁడ్రా నువ్వు? ప్రతీ కోన్‌కిస్కాగాడూ లోనకొచ్చెయ్యడమేనా? ఇది ఉమెన్స్ హాస్టలనుకున్నావా? లేక నీ అత్తగారిల్లనుకున్నావా. నీలాంటివాళ్ళవల్ల ఇక్కడ జరగకూడనిదేదైనా జరిగిందనుకో, ఎవఁడ్రా రెస్పాన్సిబుల్? అసలే ఈ మధ్య హాస్టళ్ళలో ఏవేవో జరుగుతున్నాయని వెధవగోల ..... ఎంతమంది నాలాంటి వాళ్ళు స్ట్రిక్టు వార్డెనులున్నా, తప్పదు మరి ..... ఎక్కడో ఏదో జరిగిందని, అన్ని హాస్టళ్ళనీ దుమ్మెత్తిపోయడం తప్పంటాను. నువ్వేమంటావ్" సడన్‌గా ఆవిడ అలా అనేసరికి మూర్తి కేమనాలో తోచలేదు.

"యూ ఆర్ రైట్ ఆంటీ. యూ ఆర్ రైట్"

"ఇప్పుడు చెప్పు అబద్ధాలాడితే సహించన్నేను" ఆ మాటకి మళ్ళీ మొదటినుంచీ రికార్డు పెట్టాడు మూర్తి.

"సుధారాణి - ఆ పిల్లగురించి నాకేం అర్థం కాదు. నేనంటే బొత్తిగా భయంలేదు, భక్తి లేదు. ఎక్కడెక్కడో తిరుగుతుంది. ఏమైనా అంటే కళ్ళలో నీళ్ళు పెట్టుకుంటుంది. ఈ ఆడపిల్లల్తో ఇదే గోల. నీళ్ళను కళ్ళల్లోనే నిల్వచేసుకుని వుంటారుకామోసు"

"అవునాంటీ! సుధ గురించి అదే మా బెంగానూ. అందుకే దాన్ని అప్పుడప్పుడు టెస్ట్ చెయ్యడానికి ఇలా వాళ్ళ డాడీ నన్ను పంపుతుంటాడు" సరిగ్గా అతికే అబద్ధం ఆడాడు మూర్తి.

"తెల్నీ తెలియని వయస్సులోనే ఆడపిల్లల్ని అదుపులో పెట్టుకోవాలి. ఏదో ఉద్యోగం తప్పదని చెయ్యడం తప్పించి, వీళ్ళందరి గోలా నాకెందుకయ్యా చెప్పు. నేను మా ఆయన్నే అదుపులో పెట్టుకోలేక చస్తున్నాను" పర్సనల్ విషయాల్లోకి వెళ్ళిపోయిందావిడ.

పాపం భోళా మనిషి, అమాయకంగా మొహం కనబడితే చాలు, ఆవిడ తన కష్టం సుఖాలన్నీ చెప్పేసుకుంటుంది. ప్రథమకోపం తప్ప-- ఆ కోపానికి ఆ హాస్టలమ్మాయిలు ముందు బలయిపోతారు, తర్వాత ఆవిడ కథలన్నీ ఏకరువు పెట్టడంతో అప్పుడూ బలయిపోతారు. అందుకే వార్డనంటే అంత హడల్.

"ఏమిటాంటీ ..... అంకుల్ మిమ్మల్ని, దేవతలాంటి మిమ్మల్ని ఇబ్బంది పెడతారా-" అన్నాడు సాధ్యమైనంత సానుభూతి నటిస్తూ.

"నువ్వేదో మాంచివాడిలా వున్నావ్ ..... కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని నేనేదో కొంచెం లావుగా వుంటానని--" తన సహజ ధోరణిలో చెప్పుకుపోతోందావిడ.

"ఫర్లేదాంటీ-- రోజూ బస్కీలు తీయండి. జాగింగ్‌కి వెళ్ళండి. ట్రిమ్ముగా హేమమాలినిలాగా తయారైపోతారు-- మీకేం- సి ఎం. అయ్యాక జయలలితనే చూడండి. ఎలా అయిపోయింది-- వార్డెన్‌గా వచ్చాక, హాస్టల్ కూడు తిని మీరూ అలా అయిపోయివుంటారు. అంతే కానీ --"

“యూ ఆర్ కరెక్ట్ ..... కరెక్ట్ ..... నీలా ఆలోచిస్తే, మా ఆయన ఎప్పుడో దార్లోకొచ్చేవాడు. పూర్‌ఫెలో ..... ” భర్తమీద జాలిపడింది ఆవిడ.

ఏదో అనబోతున్న వార్డెన్ చూపులు గేటులోంచి వస్తున్న సుధారాణిమీద పడ్డాయి.

“అదుగో వస్తుందయ్యా. వెంటనే నువ్వేం మాట్లాడక--” అని చెప్పి--

వార్డెన్‌ని చూసి ఇక సోది తప్పదని లోనికొస్తున్న సుధారాణిని పిలిచి “ఏయ్ అమ్మాయ్-- నీకెన్నిసార్లు చెప్పాలమ్మా-- కాలేజి అవగానే హాస్టల్‌కి రమ్మని- ఒంటిగంటకు క్లాసులైపోతే, ఇప్పుడా నువ్వు రావడం! ఎక్కడికెళ్ళావ్” భీకరంగా అరచినట్టు అడిగింది.

“మా కజిన్ వచ్చాడని ఎవరో చెప్తే, బస్టాండుకి వెళ్ళాను మేడమ్” సుధారాణి నోట్లోంచి అబద్ధాలు పుట్టలు పుట్టలుగా వస్తాయి. టక్కున ఓ అబద్ధం ఆడేసింది.

“బస్టాండులో బస్సుదిగి నీ కజిన్ అక్కడే అలా తిరుగుతుంటాడా? హాస్టల్‌కి రాడా--చూడు పాపం నీ కజిన్ ఇక్కడ ఎంతగా నీ కోసం వెయిట్ చేస్తున్నాడో” ప్రక్కనున్న మూర్తిని చూస్తూ అంది వార్డెన్.

ఈ మూర్తి ఇక్కడెందుకున్నాడా! అని ఆలోచిస్తూనే లోనికొచ్చింది సుధారాణి! తనతో ఏదో పనుందన్నమాట. విషయం అర్థమైంది సుధారాణికి.

“మేడమ్ మా కజిన్‌తో మాట్లాడి వచ్చేస్తాను--” రిక్వెస్టుగా అడిగింది.

“మరి వెళ్ళవూ ..... వెళ్ళు కానీ ఎనిమిది గంటల లోపు హాస్టల్‌లో వుండాలి. అర్థమైందా”

సుధారాణి మూర్తివైపు చూసింది.

మూర్తి వార్డెన్ వేపు చూసి “థాంక్స్ ఆంటీ!” అన్నాడు. ఇద్దరూ గేటుదాటి బయటికొచ్చారు.

“ఏం కజినూ ఏమిటిలా వూడిపడ్డావ్. నువ్వొచ్చావంటే, ఏదో వుంటుంది” అంది సుధారాణి.

“నువ్వు చిన్న హెల్ప్ చెయ్యాలి. అందుకే వచ్చాను. నాక్కాదనుకో మధుకర్‌కి”

మధుకర్ పేరు వినగానే సుధారాణి ముఖం నియాన్‌లైట్‌లా వెలిగిపోయింది.

మధుకర్‌ని ఎట్రాక్ట్ చెయ్యాలని ఎన్నో ప్రయత్నాలు చేసింది. చేస్తోంది కూడా.

కానీ మధుకర్ వీటినేమీ పట్టించుకోవటంలేదు. సుఖం, సంతోషం, లగ్జరీ ప్రతి నిమిషం కావాలని కోరుకునే, అవి కనీసం ఆమడ దూరంలో కూడా అందుబాటులో లేని మధ్య తరగతికి చెందిన పిల్ల సుధారాణి.

“చెప్పు చెప్పు-- ఏంటా హెల్ప్. కానీ ఆ హెల్ప్ వుత్తినే చెయ్యను ..... తెల్సుకదా” అంది సుధారాణి.

“నాకు తెల్సు కజినూ. ముందు పద, బారుకెళ్దాం. అక్కడ మాట్లాడుకుంటే, బాగుంటుందికదా--” బారు పేరెత్తగానే సుధారాణి నరాలు జివ్ జివ్ మన్నాయి. బీరు తాగి ఎన్నాళ్ళయిందో కదా మనసులో అనుకుంది.

దగ్గర్లో వున్న ..... కోణార్క్ బార్లోకి నడిచారు.

హేండ్‌బాగ్ టేబిల్‌మీద పెడుతూ “ఇప్పుడు చెప్పు కజినూ” అంది సుధారాణి నాటకీయంగా.

“చెయ్యాల్సిన పనేంటో చెప్పాలా! స్టీవార్టుకి ఆర్డరేంటో చెప్పాలా” అడిగాడు మూర్తి.

“ముందు ఆర్డర్ చేయ్. నాకేమో జిమ్‌లెట్. చాలారోజులైంది. తాగి ” అంది సుధారాణి.

"నాకు బీరే చాలు" పక్కన స్టిఫ్‌గా జండాకర్రని అమాంతం మింగినవాడిలా నిలబడ్డ స్టీవార్డ్‌తో ఏం కావాలో చెప్పాడు మూర్తి.

"చూడు సుధా. మన మధూకి నువ్వు చేసే హెల్ప్ ఇది. నీ ఫీజ్ ఇచ్చేస్తాలే. మహతికి ఓ ఫోన్ చెయ్యాలి. చేసి, హోటల్ త్రిలోకా రూం నెంబర్ 202 కి రమ్మని చెప్పాలి. నీ బర్త్‌డేకి ఫ్రెండ్సందర్నీ పిలుస్తున్నానని చెప్పు. వాళ్ళిద్దరికీ ఒకరిమీద ఒకరికిష్టం వుంది. ఎవరో ఒకరు చొరవ తీసుకోకపోతే ఎలా? అందుకే వాళ్ళనక్కడ కలిపామనుకో-"

జేబులోంచి అయిదువందలనోటు తీసి టేబుల్‌మీద పెట్టాడు మూర్తి. ఆ డబ్బుని తీసి హేండ్‌బాగ్‌లో సర్దుకుంది సుధారాణి.

"అదేనా చేస్తాలే. ఒక రౌండ్ జిమ్‌లెట్ కొట్టేస్తే వేడివేడిగా ఫోన్ దగ్గరకెళ్ళొచ్చు"

ఆర్డరిచ్చిన ఉప'ద్రవాలు' తెచ్చి టేబిల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు 'సర్వర్'. చీర్స్ కొట్టి సిప్ చేస్తున్నారిద్దరూ.

తను మధుకర్ దగ్గర్నుంచి బయటకొచ్చి రెండుగంటలయింది. త్వరగా వెళ్ళాలి అనుకున్నాడు మూర్తి.

ఈ అవకాశాన్ని ఎలాగయినా తను ఉపయోగించుకోవాలి అని ప్లాన్ చేస్తోంది సుధారాణి.

"ఇవాళ మహతిని ఏదో ఒకటి చెయ్యాలి" అక్కడ ఓపెన్ స్ట్రీట్ బార్లో అయిదో పెగ్గులో తనలో తను అరవై అయిదోసారి అనుకున్నాడు మధుకర్.

అయిదు నిముషాల తర్వాత-- లేచి కౌంటర్ దగ్గరున్న ఫోన్ వేపు నడిచింది సుధారాణి.

సుధారాణి ఫోన్ దగ్గరకెళ్ళడం, నెంబరు తిప్పడం, మాట్లాడడం అన్నీ గమనిస్తున్నాడు మూర్తి దూరం నుంచి. స్పీకర్‌లోంచి విన్పిస్తున్న సాంగ్స్ జనం

మాటలవల్ల సుధారాణి మాట్లాడుతున్నదేదీ విన్పించటం లేదు. హావభావాలు కన్పిస్తున్నాయి. రెండు నిముషాల తర్వాత వెనక్కొచ్చి, తన సీట్లో కూర్చుంటూ గ్లాసులో మిగిలిన డ్రింక్ పూర్తి చేసేసింది.

"డ్రింక్ రిపీట్ చెయ్యనా--" అన్నాడు మూర్తి.

"నో థాంక్స్--"

బిల్లిచ్చి బయటకొస్తూ "థాంక్స్ సుధా- రేపు కాలేజీలో కలుద్దాం"

ఆటోని పిలిచి ఎక్కాడు అతను.

ఆటో విద్యానగర్ బ్రిడ్జ్ వేపు వెళుతోంది.

ఇంకో ఆటో తీసుకుంది సుధారాణి. చకచకా ఎన్నో ఆలోచనలు. ఏం చెయ్యాలో స్పష్టంగా నిర్ణయించుకున్నాక హేపీగా నవ్వుకుంది.

అప్పటికి ఆటో ఉమెన్స్ హాస్టల్‌గేటు ముందుంది.

*　　　*　　　*　　　*